క్లుప్తంగా

ప్రజలను వంచించిన ఎమ్మెల్యే శ్రీదేవి

ఫిరంగిపురం: నియోజకవర్గ ప్రజలను ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి వంచించిందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా ఆరోపించారు. మండలంలోని వేములూరిపాడులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీపై ఆమె చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అవినీతి అక్రమాలు తెలిసి పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసిందన్నారు. సమావేశంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.ఆనంద్, ఏ రత్నం, మండల కో ఆప్షన్ మెంబర్ సుభానీ, సయ్యద్ మీర, కరిముల్లా, షేక్ బాబు, సైదులు, నూర్, బాబు, మౌలాలి, అమానుల్లా పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి



మంగళగిరి: నగర పరిధిలోని ఇప్పటంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌతు లచ్చన్న విగ్రహంతో పాటు దివంగత ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహన్‌రంగా, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లచ్చి తులసీదాస్, లచ్చి వెంకటేశ్వర్లు, లచ్చి గోపాలకృష్ణ, వీరంకి వెంకటశివయ్య, మున్నంగి వివేకానందరెడ్డి, మోదుగుల బ్రహ్మారెడ్డి, గాజుల రామచంద్రయ్య, గాజుల కృష్ణమూర్తి, వీరంకి ఉమామహేశ్వరరావు, వాకా మంగారావు, యేమినేని అర్జునరావు పాల్గొన్నారు.

గద్దర్ సంస్మరణ సభ



తెనాలి టౌన్: పట్టణంలోని జైభీమ్ కార్యాలయంలో బుధవారం విప్లవ గాయకుడు కామ్రేడ్ గద్దర్ సంస్మరణ నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు దేవానంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం గద్దర్ చేపట్టిన కార్యక్రమాలు స్ఫూర్తినిచ్చాయన్నారు. ఆయన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం వచ్చిందన్నారు. గద్దర్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఫెడరేషన్ సలహాదారులు అబ్రహాంలింకన్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.భూషణం, న్యాయవాది మానుకొండ లెనిన్‌వర్మ, కె.రామారావు, దాసరి వెంకటేశ్వరరావు, బాబు, పీటర్‌పాల్, ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కాల్వలో మృతదేహం

తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరు గ్రామంలో కాల్వలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. గ్రామంలో చినపల్లె వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వెంబడి వంతెన వద్ద కాల్వలో చెత్తలో పురుషుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు బుధవారం సాయంత్రం సమాచారమిచ్చారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అప్పటికే చీకటి పడడంతో మృతదేహాన్ని కాల్వలో నుంచి తీయడానికి వీలు కాలేదు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని, మృతి చెంది నాలుగు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. గురువారం మృతదేహాన్ని వెలికి తీయించి పోస్ట్‌మార్టమ్ కోసం పంపుతామని పోలీసులు తెలిపారు.

రేపు మండల సర్వ సభ్య సమావేశం

కొల్లిపర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ పద్మావతి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.చంద్రమోహన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ సమావేశంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు , పంచాయతీ కార్యదర్శులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో సమస్యలు ఉంటే సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తెనాలిరూరల్: తెనాలి మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో సర్పంచ్ ఎన్నిక, హాఫ్‌పేట గ్రామంలో వార్డు మెంబరు. ఉప సర్పంచ్ ఎన్నిక ఈ నెల 19వ తేదీన జరుగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను అధికారులు బుధవారం పరిశీలించారు. తహసీల్దార్ కె. రవిబాబు, ఎంపీడీఓ విజయాలక్ష్మిలతో కలిసి డీఎస్పీ బి. జనార్ధనరావు పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. అక్కడి ఏర్పాట్లను అధికారులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ జరిగే 48 గంటల ముందు ప్రచారాన్ని ఆపేయాలని, ప్రచారానికి మైక్ పర్మిషన్ తప్పనిసరి అని అభ్యర్థులకు సూచించారు. గురువారంతో ప్రచారాన్ని ఆపేయాలన్నారు.

ప్రతి హామీని నెరవేర్చిన తరువాతే గడప గడపకు..

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త సురేష్ కుమార్
- మందడంలో గడప గడపకు మన ప్రభుత్వం



పథకాలపై మహిళకు అవగాహన కల్పిస్తున్న కత్తెర సురేష్ కుమార్

మందడం(తాడికొండ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చిన తరువాతే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్ కుమార్ పేర్కొన్నారు. తుళ్లూరు మండలం మందడంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అందించిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేద వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. జగనన్న పాలనలో సంక్షేమం అందలేదని చెప్పే దమ్ము ప్రతిపక్షాలకు లేదని పేర్కొన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్రాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులకు దోచిపెట్టిన చంద్రబాబు కార్పొరేట్ విద్యా వ్యవస్థకు ఊతమిచ్చి పేదవాడికి విద్యనుందకుండా చేశాడని మండిపడ్డారు. బాబు అండ్ కో ఎన్ని కుయుక్తులు పన్నినా రాష్ట్రంలో మరో 50 సంవత్సరాలు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఆలూరి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఆలూరి పెద శ్రీనివాసరావు, జేసీఎస్ మండల కన్వీనర్ బండి ప్రసాద్, ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, అరేపల్లి జోజి, చనుమోలు రామారావు, డీజే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాహితీలోకంలో చిరంజీవి శారద

- నేడు శారద వర్ధంతి సందర్భంగా...
- 19వ శతాబ్దపు గొప్ప రష్యన్ నవలలతో



చిత్రకారుడు చంద్ర గీతల్లో శారద



శారద

తెనాలి: 'సాధారణంగా మేము శారద నవలను 19వ శతాబ్దపు గొప్ప రష్యన్ నవలలతో పోల్చేవాళ్లం. ముఖ్యంగా డాస్టోయెవ్‌స్కీ నవలలతో. శారద తెలుగువాడు కాదని తమిళుడని, అసలు పేరు నటరాజన్ అని, తెలుగు నేర్చుకుని తెలుగు రాశాడని తెలిసి అతడి మీద మా గౌరవం పెరిగింది. అతడు తెనాలిలో హోటల్ సర్వరుగా పనిచేస్తున్నాడని, కటిక పేదరికం అనుభవిస్తున్నాడని తెలిసి ఇంకా పెరిగింది. అతని నవల డాస్టోయెవ్‌స్కీ నవలల్లా ఉందనుకోవటమేకాక, డాస్టోయెవ్‌స్కీలాగా శారదకూ మూర్ఛవ్యాధి వుందని తెలిసినప్పుడు బాధతోపాటు, ఆ పోలిక సరిగానే ఉందనిపించింది.'

తెలుగు కథకుల్లో ఒక మెరుపులా...

తెలుగు కథకుల్లో ఒక మెరుపులా అతి స్వల్పకాలంలోనే ఉప్పెనలా విరుచుకుని వచ్చిన శారద, ఎందరినో విభ్రాంతులను చేశాడు. ఇంగ్లిష్ రచనల అనువాద సాహిత్యం తెలుగు పత్రికలకు జాడ్యంలా తయారైన కాలంలో సాహిత్య ఖండమనదగ్గ శారద స్వతంత్ర నవల 'మంచీ చెడు' ఒక అపూర్వ సంచలనం. అందుకు సుప్రసిద్ధ పత్రికా సంపాదకుడు నండూరి రామమోహనరావు ప్రత్యక్ష సాక్షి. శారద నవలల్ని సీరియల్‌గా ప్రచురించి, ఆ నవలల్ని, ఆయన పేరును తెలుగునాట విరివిగా ప్రాచుర్యంలోకి వచ్చేందుకు కారకులు నాటి ఆంధ్రపత్రిక సంపాదకుడు సూరంపూడి సీతారాం. ఉపసంపాదకుడు నండూరి రామమోహనరావు. 2003లో విజయవాడ సాహితీ మిత్రులు నిర్వహించిన జ్ఞాపకాల సభకు రాసిన వ్యాసంలోనే శారదను, రష్యన్ రచయిత డాస్టోయెవ్‌స్కీతో పోల్చారు రామమోహనరావు. తెలుగు నవలా సాహిత్యాన్ని ఒక మలుపు తిప్పిన వారిలో శారద ఒకరనీ, ఆ నవలలు తెలుగులో స్వతంత్ర నవలలు వచ్చేందుకు దోహదపడ్డాయని స్పష్టంచేశారు.

శారద అసలు పేరు ఎస్.నటరాజన్. పూర్తిపేరు సుబ్రమణ్యయ్యరు నటరాజన్. 1937లో బతుకుదెరువు కోసం తండ్రితో కలిసి తెనాలి చేరాడు. హోటల్ కార్మికుడిగా చాలీచాలని సంపాదనతో తండ్రిని పోషించాడు. పదిహేనేళ్ల వయసులో తండ్రి పోవడంతో క్షోభతో మూర్ఛరోగానికి గురయ్యాడు. హోటల్ వృత్తిలో వుంటూనే తెలుగు నేర్చాడు. నాటి తెలంగాణ పోరాటం, ఆర్థికమాంద్యం, సామాజిక సంక్షోభాలు, కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలతో ఆయన సాహిత్య సృజన వేయిరేకులై వికసించింది. హోటల్‌లో వంటమాస్టరుగా, కళాయితో బజ్జీలు వేయటం, బస్టాండులో నెత్తిమీద కుండతో మజ్జిగ విక్రయించినా, ఏమాత్రం ఖాళీ దొరికినా పుస్తకాలు చదువుతూనో, రాస్తూనో గడిపాడు.

భౌతికజీవితం 30 ఏళ్లయితే...

భౌతికజీవితం 30 ఏళ్లయితే సాహిత్యజీవితం ఏడేళ్లు మాత్రమే. ఆ వ్యవధిలోనే శారద కలంపేరుతో నూరుకు పైగా కథలు, ఆరేడు నవలలూ రాశారు. మంచీచెడూ, అపస్వరాలు, ఏది సత్యం, మహీపతి, సందేశం, నాగరికుని ప్రేమ, అందాలదీవి నవలలు నాటి రోజుల్లో సంచలనం. హోటల్ వర్కర్, నరబలి వంటి నాటికలు, క్షణంలో సగం పేరుతో వంద వరకు రాజకీయ చెణుకులు, అనేక గల్పికలు శారద కృషిని తెలియజేస్తాయి. సమస్త జీవితం గాయాలమయమై ఎన్నెన్నో నిరాదరణలకూ, హేళనలకూ గురవుతూ ఎన్నో వత్తిళ్లలోంచి, దుఃఖంలోంచి జీవిత పోరాటమే సాహిత్యంగా, సాహిత్యమే జీవితంగా పలవరించాడు శారద. తెలుగువాడు కాకున్నా అతడు తన రచనల్లో అంత గొప్పగా తెలుగుతనాన్ని పంచటం ఆశ్చర్యకరం. రచనల్లో చిత్రించిన తెలుగు జీవితం, తెలుగు వాతావరణం, తెనాలి, విజయవాడ, గుడివాడ వంటి కథాస్థలాలను అతడు ప్రస్తావించిన తీరు, కథల్లోని వాస్తవికతకు ఎంతో దోహదపడ్డాయి. అందుకే శారద 1955లోనే కన్నుమూసినా, తన రచనలతో చిరంజీవిగానే ఉండిపోయారు. తెలుగును నేర్చుకుని, తెలుగువారి జీవితంతో మమేకమైన రచనలు చేసిన 'శారద'లా తెలుగువారి అభిమానాన్ని చూరగొన్న మరొక రచయిత లేరనడం అతిశయోక్తి కాదు. నేటికీ ఆయన రచనలను ఇష్టపడి చదివే పాఠకులున్నారు. 'ప్రతి నిరుద్యోగిలోనూ, అన్నార్తునిలోనూ, దిగులుతో నసిపోతున్న ప్రతి రచయితలోనూ శారద జీవించే ఉన్నాడు'- శారద మిత్రుడు, జ్ఞానపీఠ్ అవార్డుగ్రహీత రావూరి భరద్వాజ అనేవారు.

1955, 1963, 1998లో దేశీ కవితా మండలి, ఆదర్శ గ్రంథమండలి, శారద సాహిత్యవేదిక శారద సాహిత్యాన్ని ప్రచురించాయి. మిత్రుడు ఆలూరి భుజంగరావు రచన 'సాహిత్య బాటసారి శారద' తన సహచరుడి జీవితాన్ని, నాటి పరిస్థితులను కళ్లకు కట్టింది. 2015లో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) శారద మూడు నవలలతో 'శారద రచనలు' తీసుకొచ్చింది. అదేవిధంగా రక్తస్పర్శలోని 35 కథలు, సేకరించిన మరో 17 కథలు, మరికొన్ని గల్పికలు, ఒక రూపకం, లేఖలు, కవితలతో 'శారద సాహిత్యం' (కథలు, గల్పికలు, లేఖలు)ను అరసం ప్రచురించింది.

నకిలీలతో మెప్మాలో దారుణాలు

- సీఆర్ నగర్‌లో వెలుగుచూసిన మరో మోసం
- ఫేక్ ఆర్పీ పేరుతో డ్వాక్రా గ్రూపు లోన్లు
- ఇప్పించిన ప్రతిసారి వేలల్లో కమీషన్
- లోను డబ్బులు బ్యాంకులో జమ చేయకపోవడంతో నోటీసులు
- ఫేక్ ఆర్పీపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన సీఆర్ నగర్ డ్వాక్రా గ్రూపు సభ్యులు



కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన సీఆర్ నగర్ డ్వాక్రా గ్రూపు మహిళలు

నెహ్రూనగర్: ఫేక్ (నకిలీ)రిసోర్స్ పర్సన్(ఆర్పీ)పేరుతో డ్వాక్రా గ్రూపుల్ని మోసం చేస్తూ కాసులు దండుకుంటున్న మెప్మా సిబ్బందిపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొద్ది రోజుల కిందట ఐపీడీ కాలనీలో ఓ మహిళ ఫేక్ ఆర్పీ అవతారం ఎత్తి ఓ బ్యాంకులో లోన్లు ఇప్పించి, కమీషన్లు తీసుకున్న అంశం మరవకముందే గుంటూరు రూరల్ మండలం చౌడవరం పరిధిలోని సీఆర్ నగర్‌లో మరో అక్రమం వెలుగు చూసింది. ఫేక్ ఆర్పీ పేరిట డ్వాక్రా గ్రూపుల నుంచి కమీషన్ రూపంలో భారీ మొత్తంలో సిబ్బంది నగదు వసూలు చేశారు. లోనుకు సంబంధించిన నగదును కూడా బ్యాంకుకు జమ చేయకుండా ఇబ్బందులు గురి చేయడంపై సోమవారం కలెక్టర్ స్పందన కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు ఫిర్యాదు చేశారు.

పట్టించుకోని మెప్మా అధికారులు

26వ డివిజన్ పరిధి చౌడవరంలోని సీఆర్ నగర్‌లో 2018 నుంచి ఓ మహిళ.. ఆర్పీ పేరుతో లోన్లు ఇప్పిస్తోంది. రుణం మంజూరైన ప్రతిసారి వేల రూపాయల కమీషన్ తీసుకుంటోంది. 2021లో జీడీసీసీ బ్యాంకులో గ్రూపు సభ్యులు రూ.5లక్షలు లోను తీసుకున్నారు. ప్రతి సభ్యురాలికి రూ.50వేలు చొప్పున రావాల్సి ఉండగా, రూ.40వేలు మాత్రమే చేతిలో పెట్టింది. రూ.10వేలు చొప్పున రూ.50వేలు తీసుకుంది. పైగా రుణానికి సంబంధించిన నగదును సదరు ఆర్పీకి అందజేసినప్పటికీ బ్యాంకుకు చెల్లించకుండా సొంతానికి వాడేసుకుందని డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆరోపిస్తున్నారు. బ్యాంకు నుంచి నోటీసులు కూడా వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు ఫేక్ ఆర్పీపై మెప్మా కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో చేసేదేమి లేక గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

వందల్లో ఫేక్ ఆర్పీలు, ఫేక్ గ్రూపులు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో (విలీన గ్రామాల్ని కలుపుకుని) 10వేలకు పైగా డ్వాక్రా గ్రూపులున్నాయి. వీటిల్లో వందల సంఖ్యలో ఫేక్ గ్రూపులు ఉన్నాయని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. డ్వాక్రా లోన్ రావాలంటే తప్పనిసరిగా ఆధార్ సీడింగ్ ఉండాలి. కాని ఇక్కడ ఆర్పీలు, సీఓలు, సీఎంఎంలు కుమ్మక్కై వేరే ఊరులో నివాసం ఉండే వారి ఆధార్‌లను సేకరించి వారికి సీడింగ్ చేయిస్తున్నారు. తప్పుడు ధ్రువపత్రాలు పెట్టించి లక్షలాది రూపాయల్ని స్వాహా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

ఉన్నతాధికారులకు సైతం కమీషన్?

డ్వాక్రా గ్రూపు లోన్లు మంజూరుపై మెప్మా ఉన్నతాధికారులు పర్యవేక్షణలో లేకపోవడంతో ఆర్పీలు, సీఓలు(కమ్యూనిటీ ఆర్గనైజర్), సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) ఆడింది ఆటగా పాడింది పాటగా మారింది. ప్రతి డ్వాక్రా గ్రూపుకు లోను మంజూరైనప్పుడు తప్పనిసరిగా వేల రూపాయల కమీషన్ తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులకు సైతం కమీషన్ ఇవ్వాలని డ్వాక్రా గూపులు చెబుతుండటం గమనార్హం.

విచారణ చేపట్టాం

స్పందనలో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సదరు ఫిర్యాదు పై విచారణ చేపట్టాం. వీలైనంత త్వరగా పూర్తి చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– వెంకట నారాయణ, మెప్మా పీడీ

శరవేగంగా మెయిన్ రోడ్డు విస్తరణ పనులు



టిడ్కో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: పొన్నూరు పట్టణ అభివృద్ధికి చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కిలారి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని జీబీసీ రోడ్డు విస్తరణ పనులకు భవన యజమానులు సహకారాన్ని చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు రోడ్డు విస్తరణ 60 అడుగులు కాదు 80 అడుగులని భవన యజమానులకు అనుమానాలు రేకెత్తించేవిధంగా దుష్ప్రచారాలు, చేస్తున్నారన్నారు. భవన యజమానులు వీటిని నమ్మవద్దన్నారు. భవనాల తొలగింపు ప్రాంతంలో వచ్చేనెల మొదటి వారంలో డ్రైన్లు, రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలో ప్రధాన ట్రాఫిక్ సమస్యగా ఉన్న రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. 25 ఏళ్లలో చేయలేనిది నాలుగేళ్లలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించామన్నారు. రానున్న కాలంలో రూ.6.7 కోట్లతో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, స్టేట్ మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్ల, బొద్దులూరి రంగారావు, దేవరకొండ గోపి పాల్గొన్నారు.

టిడ్కో మంజూరు పత్రాల అందజేత

పేదలందరికీ గృహ నిర్మాణాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరులో బుధవారం పట్టణానికి చెందిన ఇద్దరు పేదలైన పి.మాలతి, కొండముది ఉమాదేవిలకు టిడ్కో గృహాల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే రోశయ్య అందజేశారు. లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లు, పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



వలంటీర్లు, పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచి రత్నకుమారి

తాడికొండ: తాడికొండ మండలం నిడుముక్కల గ్రామపంచాయతీ కార్యాలయంలో దాత బెజ్జం సాయిప్రసాద్ ఆధ్వర్యంలో 30 మంది వలంటీర్లు, పారిశుద్ధ కార్మికులకు దుస్తులు, బియ్యం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా నిడుముక్కల గ్రామ సర్పంచి మాదాసు రత్నకుమారి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ పేదలకు కరోనా కష్టకాలంలో కూడా బెజ్జం సాయి ప్రసాద్ బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి మాదాసు యేసు రత్నం, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి ధర్మరాజు, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి బాకీ వెంకటస్వామి పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలతోనే ముందడుగు



మాట్లాడుతున్న న్యాయవాది ప్రభుదాస్

గుంటూరు ఎడ్యుకేషన్: గృహ కార్మికులంతా నాయకత్వ లక్షణాల్ని అలవర్చుకోవాలని కోల్పింగ్ సొసైటీ న్యాయవాది ప్రభుదాస్ పేర్కొన్నారు. మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రంలో బుధవారం అంథేరీ హిల్స్, మాంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో గృహ కార్మికులకు నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుదాస్ మాట్లాడుతూ పేదవారిలో నాయకత్వ సామర్థ్యాల్ని పెంపొందించడం, స్వయం సహాయక సంఘాలుగా ఏర్పాటు కావడం, మహిళా సాధికారత కల్పించడంపై అవగాహన పొందాలని సూచించారు. ఆర్థికాభివృద్ధి, పొదుపు, ఆర్థిక లావాదేవీలు, రుణాల గురించి వివరించారు. స్వీయ సహాయం ఉత్తమ సహాయమని, ఐక్యత బలమని, గృహ కార్మిక మహిళలు సమష్టిగా ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్ఐ కో–ఆర్డినేటర్ సిస్టర్ వ్యాకుల మేరీ, సెయింట్ మనోవికాస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఐడా పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు పీఎస్‌లో జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ



స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి ఎస్ఐ కోటేశ్వరరావుతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

గుంటూరు రూరల్: గ్రామాల్లో శాంతికమిటీలను ఏర్పాటు చేసి శాంతిభద్రతలను కాపాడే దిశగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సూచించారు. బుధవారం సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని వట్టిచెరుకూరు మండల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. నూతన పోలీసు స్టేషన్ నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ తీర్మానం చేసి, ఆమోదం పొందిన స్థలాన్ని పరిశీలించి తదుపరి కార్యక్రమం నిర్వహించాలని అధికారుల్ని ఎస్పీ ఆదేశించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన కొంతమంది ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే స్పందించి వారి సమస్యల్ని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. స్టేషన్‌లో నమోదైన కేసులపై దృష్టి సారించి, దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, ఇతర విశేషాలను స్థానిక ఎస్ఐ కోటేశ్వరరావుని అడిగి తెలుసుకున్నారు. సర్కిల్ సీఐ సుబ్బారావు, స్థానిక ఎస్ఐ కోటేశ్వరరావుకు పలు సూచనలు చేశారు. పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల నుంచి చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుకు తప్పకుండా రిసెప్షన్ రిజిస్ట్రార్‌లో రాయడం, రశీదు ఇవ్వడం చేయాలని చెప్పారు. పోలీసు స్టేషన్‌లో న్యాయం జరుగుతుందని అనే నమ్మకం ప్రజలకు ఫిర్యాదుదారులకు కలిగించాలని ఎస్ఐకు సూచించారు. స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ ఒక గ్రామంలో పర్యటించాలని, ప్రజల సమస్యల్ని అడిగి తెలుసుకుని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు రౌడీషీటర్ల, సస్పెక్ట్ కలిగిన వారిపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొని వారి కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. రాత్రి సమయంలో నైట్ బీట్ డ్యూటీ చేస్తున్న సిబ్బంది మండల పరిధిలో ఉన్న గ్రామాలలో ముందస్తు సమాచారం తెలుసుకొని శాంతిభద్రతలను అదుపులో ఉండేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో వున్న ముఖ్య గ్రామాలలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయంలో స్టేషన్‌కు సంబంధించిన పోలీసులను కాలేజీల దగ్గర, స్కూల్స్ దగ్గర విజిబుల్‌గా ఉండే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట గుంటూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుభాష్, సీసీ శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులకు పురస్కారాలు

గుంటూరు ఎడ్యుకేషన్: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా హైదరాబాదులో సెప్టెంబర్ మూడో తేదీన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు సర్వేజనాః సుఖినోభవంతు సామాజిక, సాంస్కృతిక, సేవాసంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఈ.ఎస్.ఎస్. నారాయణ మాస్టారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ, అధ్యాపకులు ఈనెల 25వ తేదీలోపు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జాతీయస్థాయిలో ఉపాధ్యాయ రత్న, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం విద్యా బోధనతో పాటు కల్చరల్, స్పోర్ట్స్, ఆర్ట్స్, యోగా ఉపాధ్యాయులు విద్యార్హతలు, అనుభవం, సర్టిఫికెట్లు, పత్రికల క్లిప్పింగ్స్, గతంలో పొందిన అవార్డుల వివరాల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తుల్ని సర్వేజనాః సుఖినోభవంతు, డోర్ నంబరు: 1–20–164, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్–15 చిరునామాకు పంపాలని సూచించారు. వివరాలకు 9652347207లో సంప్రదించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: బ్రాడీపేట విద్యుత్ ఏఈ కార్యాలయం పరిధిలోని అరండల్‌పేటలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ ముస్తాక్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు. చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా డీ – 13 పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సీతారామ్‌నగర్, అంబేడ్కర్ నగర్, కాకాని మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హెచ్.ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



కీర్తన మృతదేహం

ప్రత్తిపాడు: మనస్తాపంతో ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. గుంటూరు ఎల్ఆర్ కాలనీ సంగడిగుంటకు చెందిన హిమకీర్తన(24) ఉరఫ్ కీర్తికి 2017లో ప్రత్తిపాడుకు చెందిన బోలె వాసుతో వివాహం అయ్యింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 1వ తేదీన కీర్తన భర్త వాసుతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి, తన స్నేహితురాలి ఇంట్లో ఉంది. కీర్తన కుటుంబీకులు గుంటూరులోని లాలాపేట పోలిస్ స్టేషనులో ఫిర్యాదు ఇవ్వడంతో కీర్తనను వెతికి పోలీసులు తల్లికి అప్పగించారు. అనంతరం ఈ నెల 7వ తేదీన పెద్ద మనుషులతో మాట్లాడి కుమార్తెను కాపురానికి పంపారు. అప్పటి నుంచి కీర్తన భర్తతో కలిసి ప్రత్తిపాడులోనే నివాసం ఉంటుంది. ఈ నేపథ్యంలో గతంలో భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలు, ఇంటి నుంచి వెళ్లి పోవడం వంటివి గుర్తుకు రావడంతో కీర్తన తీవ్ర మనస్తాపానికి గురయ్యింది. ఈనెల 10వ తేదీన ఇంట్లో ఎలుకల మందు పేస్టును నీటిలో కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వాంతులతో బాధపడుతున్న కీర్తనను చూసిన కుటుంబ సభ్యులు ఆమెను గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి తల్లి బి.పద్మావతి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.